ఈనాడు
రాజన్న సిరిసిల్ల

మిల్లుల్లో రేషన్ బియ్యం దందా!

చోద్యం చూస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, వేములవాడ

పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొంత మంది అక్రమార్కులు రైస్ మిల్లులు కేంద్రంగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. వేములవాడ పట్టణం పరిసరాలు, గ్రామీణ మండలం మర్రిపల్లి ప్రాంతంలోని కొన్ని మిల్లుల నిర్వాహకులు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ సేకరించిన వాటిని మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతరులకు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ ఏ శాఖ అధికారులు మిల్లులను తనిఖీ చేసి ఈ అక్రమాలను అరికట్టిన దాఖలాలు లేవు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది.



ఇటీవల ఓ రైస్ మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న అధికారి

తనిఖీలు నామమాత్రం

రైస్ మిల్లులు, రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో పలు రైస్ మిల్లుల్లో ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి.

డీలర్ల నుంచి ఇలా...

కొంతమంది రేషన్ డీలర్లు సైతం బియ్యం దందా సాగిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యానికి బదులు డబ్బులు ఇస్తున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ. 12 చెల్లిస్తున్నారు. తరవాత మిల్లర్లకు రూ.18 నుంచి రూ.20లకు విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వాటిని ఇతర ప్రాంతాల్లో నిల్వ చేసి అదను చూసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- కొంత మంది మిల్లర్లు రీ సైక్లింగ్ చేసి కొత్త సంచుల్లో నింపి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికే ఇచ్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- అక్రమ వ్యాపారం భారీ ఎత్తున నడుస్తున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు.

తెల్లవారక ముందే...

రేషన్ బియ్యాన్ని కొంత మంది అక్రమార్కులు తెల్లవారక ముందే పకడ్బందీగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

- ఒక వేళ తనిఖీ చేసినా పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇటీవల కొందరు ఫిర్యాదు చేయడంతో వేములవాడ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ తతంగం కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రైస్ మిల్లులు, రేషన్ దుకాణాల్లో అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. మా దృష్టికి వస్తే తప్పకుండా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. వివిధ పనుల ఒత్తిడితో తనిఖీలు పూర్తి స్థాయిలో చేయలేకపోతున్నాం. అక్రమంగా రేషన్ బియ్యం విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవు.

- రవీంద్రచారి, పౌరసరఫరాల డీటీ, వేములవాడ

సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్

ప్రత్యేకంగా కేటాయించిన మిల్లులకు తరలింపు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలులో సన్నరకం క్వింటాల్ ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వానాకాలంలో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో సన్నరకం, దొడ్డు రకాలను వేర్వేరుగా సేకరించేందుకు తీసుకుంటున్న చర్యలు, గన్నీ సంచుల లభ్యత, వరిసాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య, పంట దిగుబడి తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తాయనే అంచనాతో 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సన్నరకం జిల్లాలో 24,600 క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, కొనుగోలు కేంద్రాలకు ఎన్ని అందిస్తున్నారనే వివరాలపై నివేదిక అందజేయాలని పౌరసరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. మొత్తం 75 లక్షల గన్నీ సంచులు అవసరం ఉందని, ప్రస్తుతం మన దగ్గర 25.05 లక్షలు ఉన్నాయని పేర్కొన్నారు. మిల్లర్ల నుంచి మరో 18 లక్షలను సేకరించాలని సూచించారు. రైస్‌మిల్లర్ల దగ్గర ఎటువంటి కోతలు ఉండటానికి వీలు లేదన్నారు. రోడ్డు మీద ఆరబెట్టి ప్రమాదాలకు దారి తీయకుండా చూడాలన్నారు. టోకెన్ పద్ధతిలో మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అబ్జల్ బేగం, పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మి, మార్కెటింగ్ డీఎం ప్రకాశ్, డీసీవో రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పకడ్బందీగా కుటుంబ డిజిటల్ సర్వే

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు పకడ్బందీగా సేకరించాలని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని అయిదో వార్డులో కొనసాగుతున్న కుటుంబ డిజిటల్ సర్వేను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సేకరిస్తున్న వివరాలు, పత్రాలు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ప్రతి కుటుంబం వివరాలను విధిగా తీసుకోవాలన్నారు. జనన, మరణ వివరాలు నవీకరించాలని సూచించారు. ఫొటోలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఆన్‌లైన్‌లో రోగుల వివరాల నమోదును పరిశీలించి, రోజూ ఎంత మంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, ఎస్‌డీసీ రాధాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల అయిదో వార్డులో సర్వేను పరిశీలిస్తున్న వైద్య, కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రజలకు మెరుగైన వైద్యం

సిరిసిల్ల కలెక్టరేట్: జిల్లా పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందేలా కార్యాచరణను అమలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ధర్మగుండంలో నిమజ్జనం చేస్తూ...

బతుకమ్మ సందడి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ సందడి నెలకొంది. పెద్ద ఎత్తున పట్టణంలోని మహిళలు, యువతులు, చిన్నారులు, విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. కొందరు యువతులు కోలాటం ఆడి సందడి చేశారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. **-న్యూస్‌టుడే, వేములవాడ**


నెమలి వాహనంపై స్వామివార్ల ఊరేగింపు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివార్లు పెద్ద సేవ నెమలి వాహనంపై ఊరేగారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు వేద మంత్రాలతో నిర్వహించారు. రెండో రోజు అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామి వార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన పెద్ద సేవపై ప్రతిష్ఠించిన అనంతరం అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. తరవాత స్వామివార్లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్, ఆలయ అధికారులు, నాయకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



నేనెందుకు చెరువుకు చేరలేదు..

చేప పిల్ల అంతర్మథనం



అనగనగా.. నేను ఒక చేపపిల్లను.. ఎందుకో ఈసారి నాతోపాటు చాలా చిరు చేపలు చెరువులకు చేరలేదు. వర్షాలు బాగానే కురిశాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండాయి. కానీ మా పెంపకానికి సరిపడే విధంగా మమ్మల్ని ఉమ్మడి జిల్లాకు తీసుకు రాలేదు. పాపం.. నాలుగు జిల్లాల్లో 53,859 మంది మత్స్యకారులు గంపెడాశలతో మా కోసం ఎదురు చూస్తున్నారు. మేము సకాలంలో జలాశయాల్లోకి చేరి పెరిగి పెద్దయితే.. వారికి ఎనలేని సంబురం. 772 మత్స్య సహకార సంఘాలకు మా పెంపకం జీవనాధారం. ఆగస్టు నెల ఆరంభంలోనే ఎల్లంపల్లి, ఎగువ, మధ్య, దిగువ మానేరు జలాశయాల్లో మమ్మల్ని వదలాలి. 3,235 చెరువుల్లోకి చేర్చాలి. కానీ మా పంపిణీకి అవసరమైన టెండర్లకు గుత్తేదారులు అనాసక్తి చూపడంతో ఈ ఆలస్యం జరిగిందట. నిజానికి ఈ వానాకాలం ముందరే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే ఈ ప్రక్రియ చేపట్టాలి. అప్పట్లో ఎన్నికల కోడ్ వల్ల ఇబ్బంది ఎదురైంది. తరువాత మా సరఫరాపై సకాలంలో దృష్టి పెట్టకపోవడం, గుత్తేదారుకు కమిషన్ తక్కువ ఉంటుండటంతో ఇబ్బంది జరిగింది. ఉత్పత్తి కేంద్రాల్లోనూ అనుకున్న లక్ష్యానికి తగినట్లు మా సంతతి లేకపోవడంతో పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఇంకా జాప్యం జరుగుతోంది.

కరీంనగర్‌కే పరిమితం..

బొమ్మెలు, బొచ్చెలు, జెల్లలు, రాహు, బంగారు తీగ, ముల్లంగి తదితర రకాల్లోని మా ఉనికికి ఉమ్మడి జిల్లా జలాశయాలు అనువైన ప్రాంతం. కానీ దురదృష్టవశాత్తు ఈ సారి కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోనే ఈ నెల 3న 15 లక్షల మా తోటి చేపపిల్లల్ని ప్రజాప్రతినిధులు, అధికారులు వదిలారు. ఈ ఒక్క చోటే 30 లక్షలను పెంచాలని లక్ష్యం. కానీ సగంతోనే సరిపెట్టారు. ఈ జలాశయంపై ఆధారపడిన 2 వేల కుటుంబాలవారు ఇవి ఏ మేర సరిపోతాయనే ఆందోళనలో ఉన్నారు. ఈపాటికే మమ్మల్ని వదిలి ఉంటే.. ఈ ఒక్కచోటే 1,920 టన్నుల బరువు రూపంలో దిగుబడి.. రూ.11.50 కోట్ల ఆదాయం సమకూరేది. ఈ ఆలస్యం వల్ల మా ఎదుగుదలలో కచ్చితంగా లోపమేర్పడి జాలరులకు ఆర్థికంగా నష్టం వాటిల్లే అవకాశముంది. గతేడాదిలో నాలుగు జిల్లాల్లోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో మొత్తంగా 6.08 కోట్ల మేర మమ్మల్ని వదిలారు. ఈసారి కూడా దాదాపుగా 7 కోట్ల వరకు మమ్మల్ని జలవనరుల్లో వదలాలని భావించినా.. అనుకున్న పురోగతి లేదు. మరో వారంలో మూడు జిల్లాల్లో పంపిణీ చేస్తామనే మాటలు ఆచరణకు నోచుకుంటేనే మా ఉనికికి ఊపిరి అందే వీలుంది. మత్స్యకారులు ఇదే ఆశతో మా రాక కోసం నిరీక్షిస్తున్నారు. అసలే ఆలస్యమైందని.. అందులోనూ అరకొరగానే పంపిణీ చేసిన తీరుపై సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

చెప్పలేనన్ని ఇక్కట్లు..

- మా మీదే ఆధారపడిన మత్స్యకారులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. జాలరుల దోసిళ్లలో పిల్లలుగా మేమున్నప్పుడు వాళ్ల కళ్లలో చూసిన సంతోషం.. మేము పెద్దయ్యాక వలలో చిక్కుకున్నప్పుడు కనబడటం లేదు.
- మత్స్యశాఖ అధికారులు ముందు నుంచి అంచనాలు వేసి పంపిస్తున్న స్థాయిలో నీళ్లలోకి మేము చేరడం లేదు. కాగితాల్లో పక్కాగా మా సంఖ్య ఉంటున్నా.. జలంలోకి వదిలే సమయంలో తక్కువ పంపిణీతో అక్రమాలు జరుగుతున్నాయి.
- నీళ్లలో మమ్మల్ని జార విడిచేటప్పుడు 35 నుంచి 40 మి.మీ.ల పరిమాణంలో ఉంటాం. మమ్మల్ని పట్టుకునే సమయానికి కిలో నుంచి కిలోన్నర బరువు మేము తూగాలి. కానీ విపరీతమైన ఎండలు, కలుషిత నీటి వల్ల మా జాతిలో చాలా ముందే మరణిస్తున్నాయి.
- సంఘాల సభ్యులకు మార్కెటింగ్ సహా ఇతర సౌకర్యాల పరంగా ఇబ్బందులను అధికారులు తీర్చాలి. ఏడాదికి 6 కోట్లకుపైగా పంపిణీ చేస్తే మేము పెరిగి పెద్దై 6వేల టన్నుల దిగుబడిగా మారాలి. కానీ 3-4 వేల టన్నుల దిగుబడే వస్తుండటం బాధాకరం.
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా దృష్టి పెట్టి మా సంతతి కోసం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఉన్న ఉత్పత్తి కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి. మా మీదే ఆధారపడిన మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి తోడ్పడే చర్యల్ని తీసుకోవాలి.

– ఈనాడు, కరీంనగర్

గొయ్యి పూడ్చివేత

ఈనాడు స్పందనకు వందనం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: గతంలో కురిసిన వర్షాలకు ముస్తాబాద్ శివారులో ఎగువ మానేరు జలాశయం కాల్వ కట్ట కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనిపై గత నెల 15న 'ఈనాడు'లో 'మానేరు కాల్వ కట్టకు గొయ్యి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ డీఈ రవి కుమార్, ఏఈ వంశీకృష్ణలు స్పందించారు. జేసీబీ సహాయంతో సిబ్బందితో గొయ్యిని పూడ్చివేయించారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గొయ్యి పూడ్చివేస్తున్న నీటిపారుదలశాఖ సిబ్బంది

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

వేములవాడ గ్రామీణం, బోయినపల్లి న్యూస్‌టుడే: మధ్య మానేరు జలాశయం బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం మధ్యమానేరు ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిని నిలపడంతో తమ పంట పొలాలు మునుగుతున్నాయని అనుపురం, ఆరెపల్లి, వర్దవెల్లి గ్రామాల రైతులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లగా మధ్యమానేరు ఇంజినీరింగ్ అధికారులు పొలాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పంట పొలాలు మునగకుండా దిగువకు నీటిని వదిలారు. సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని, పంట పొలాల్లోకి నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఈ జగన్, డీఈ శ్రీనివాస్, జేఈ రాధిక, రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు తదితరులు

ఆపన్న హస్తం

ఫిర్యాదులకు పోలీసుల తక్షణ స్పందన



రామగుండం కమిషనరేట్‌లో డయల్ 100 ఫిర్యాదులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం, జగిత్యాల, గోదావరిఖని

ఆపదకాలంలో ఆపన్న హస్తంగా పోలీసుల 'డయల్-100' బాధితులకు భరోసానిస్తోంది. ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయం, కమిషనరేట్ పరిధిలో డయల్ 100 పర్యవేక్షణకు ఒక కంట్రోల్ రూమ్ ఉంటుంది. ఇందులో ఒక సీఐ స్థాయి అధికారితోపాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, ఆరుగురు కానిస్టేబుల్స్ మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తూ ఫోన్ కాల్స్‌ను పర్యవేక్షించడంతోపాటు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.

- గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ చిరుద్యోగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. కొనుగోలు చేసిన ఇంటికి నెలవారీ కిస్తీలు కట్టలేకపోవడం, బ్యాంకు వాళ్ల నోటీసులు పంపిస్తుండటంతో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 20న గొడవ పెరగడంతో స్థానికులు 100 నంబరుకు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. తరవాత చిరుద్యోగి భార్య ఇంటి తలుపులు మూసుకుని నిద్రమాత్రలు మింగడంతో కుటుంబ సభ్యులు మళ్లీ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వెంటనే వచ్చి తలుపులు తెరిచి 108కి సమాచారం ఇచ్చి ఆమెను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు.
- సెప్టెంబరు 10న సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యులు 100కు ఫోన్ చేశారు. సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాస్ బృందాలుగా విడిపోయి ఆచూకీకి వెతకగా వంశీకృష్ణ కాలనీలో స్పృహ తప్పి పడిపోయినట్లు గుర్తించి 108కి సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఎలా పని చేస్తుందంటే?

- ఆపదలో ఉన్నవారు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై డయల్ 100కు ఫోన్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది.
- సమాచారం అందుకున్న సిబ్బంది పట్టణ, నగర ప్రాంతాలైతే 10 నిమిషాల్లో.. మారుమూల గ్రామీణ ప్రాంతమైతే అర గంటలో చేరుకోవాలి.
- వెంటనే ట్యాబ్‌లో ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను నిక్షిప్తం చేసి ప్రాథమిక సమాచారం కంట్రోల్ రూమ్‌కు పంపిస్తూనే తగిన సహాయక చర్యలు చేపట్టాలి.



నిర్భయంగా చేయండి..

- **డయల్ 100కు ఉమ్మడి జిల్లాలో గత ఏడాది కాలంలో లక్షకు పైగా ఫిర్యాదులు వచ్చాయి.**
- ఆపదలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై 100కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సి వస్తుందనే భయం అవసరం లేదు. డయల్ 100కు ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సిన పని లేదని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో సమయంలో ఫిర్యాదులు ఇలా..

- **సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు :** రహదారులపై ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీ, ఆకతాయిల ఆగడాలు
- **రాత్రి 9 గంటల నుంచి :** మద్యం మత్తులో తాగుబోతుల ఆగడాలు, రహదారులపై వాగ్వాదాలు, గొడవలు, రౌడీ షీటర్ల అరాచకాలు.
- **రాత్రి 10 గంటల తరవాత :** భార్యాభర్తల మధ్య గొడవలు, గొడవలతో ఇంటి నుంచి బయటకు గెంటేసిన.. మద్యం సేవించి ఇంట్లో వారిపై, చుట్టుపక్కల వారిపై భౌతిక దాడులకు పాల్పడటం, హత్యాయత్నానికి పాల్పడుతామని బెదిరింపులు
- **అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు :** తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు, రహదారి ప్రమాదాలు, మద్యం గొలుసు (బెల్ట్) దుకాణాల నిర్వహణపై

మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదులు : ఆకతాయిల వేధింపులు, ఫోన్‌లో అసభ్య చాటింగ్, ర్యాగింగ్, తాగుబోతుల అరాచకాలు, భర్తల వేధింపులు, ఆత్మహత్యాయత్నాలు, గృహహింస

పురుషుల నుంచి : రహదారి ప్రమాదాలు, వాగ్వాదాలు, పశువుల అక్రమ రవాణా, రేషన్ బియ్యం, గుట్కా దందా, మద్యం గొలుసు దుకాణాల విక్రయాలు

ఏడాది కాలంలో..

జిల్లా	వచ్చిన ఫిర్యాదులు	నమోదైన కేసులు
పెద్దపల్లి	55,969	571
రాజన్న సిరిసిల్ల	13,434	256
జగిత్యాల	26,613	293

ఓటమితో నిరాశపడొద్దు

ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే: ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమితో జట్టు నిరాశ చెందొద్దని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల బైపాస్‌కు చేరువలోని రైజింగ్ అకాడమిలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో నాలుగు జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో రాజన్న సిరిసిల్ల జట్టుపై కరీంనగర్ విజేతగా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 7 నుంచి 10 వరకు గద్వాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాణి రామలింగారెడ్డి, శిక్షకుడు డేవిడ్ సన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఆహార శుద్ధికి అడుగులు

- మూడేళ్లకు తొలి యూనిట్ పూర్తి
- అనుమతుల ధ్రువీకరణకు సన్నాహక ఉత్పత్తి





నర్మాలలో నిర్మాణం పూర్తయిన ఆహారశుద్ధి పరిశ్రమ

ఈనాడు, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులు.. దుస్తుల తయారీయే కాదు జిల్లాలో వీటి సరసన ఆహారశుద్ధి పరిశ్రమలూ చేరుతున్నాయి. మూడేళ్ల క్రితం నర్మాలలో ఆహారశుద్ధి హబ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రస్తుతం అందులోని తొలి యూనిట్‌లో ట్రయల్ రన్ జరుగుతోంది. మరిన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చేలా కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు చేస్తుంది. ఇది పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వడం ప్రారంభిస్తే జిల్లాలో పంట ఉత్పత్తులకు విలువలు జోడిస్తూ రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. సాగులోనూ అనూహ్య మార్పులు వస్తాయి. నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.



అంతర్గత రహదారుల నిర్మాణ పనులు

రూ.10 కోట్ల పెట్టుబడి

జిల్లా సరిహద్దులోని గంభీరావుపేట మండలం నర్మాలలో ఆహారశుద్ధి పరిశ్రమలకు 2017-18లో 350 ఎకరాల భూమిని సేకరించారు. అందులో 2021లో దుబాయ్‌కు చెందిన అగస్త్యా ఆహారశుద్ధి పరిశ్రమ ముందుకొచ్చింది. 3.5 ఎకరాల్లో రూ.10 కోట్ల పెట్టుబడితో మూడేళ్లకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉత్పత్తుల దిశగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల పరమైన అన్ని రకాల తనిఖీలు, ఆయా శాఖల నుంచి ధ్రువీకరణల ప్రక్రియలు ముగిశాకే పూర్తిస్థాయి ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయి.

- ఒక షిఫ్టులో 8 టన్నుల ధాన్యం ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం ఉంది. దీనిలో రాగులు, జొన్న, సజ్జలతో ఆహార ఉత్పత్తులు తయారవుతాయి. మార్కెట్‌లోకి వీటి ఉత్పత్తులు ప్రారంభమయ్యాక, ఇదే కంపెనీకి చెందిన మరో రెండు పరిశ్రమల నిర్మాణం ఈ హబ్‌లో ప్రారంభించనున్నారు.

చిరుధాన్యాలకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి 11 లక్షల ఎకరాలు సాగైంది. వీటిలో 3.37 శాతం మాత్రమే చిరు ధాన్యాలు ఉన్నాయి. 2020లో ఇవి 7.15 శాతం ఉండేవి. జలాశయాల నిర్మాణంతో సాగునీటి లభ్యత పెరిగింది. దీంతో రైతులు వరి, పత్తి పంటలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీనికితోడు పక్కనే ఉన్న ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోనూ చిరుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పక్క రాష్ట్రాల్లోనూ కంపెనీ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్పత్తులు సేకరించేలా రైతుల వద్దకు వెళ్తున్నారు.



- జిల్లాలోనూ వ్యవసాయశాఖ, ఇతర అనుబంధ రంగాలతో కలిసి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించి వారితో కలిసి సాగు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ కంపెనీకి తెలంగాణ, కర్ణాటకలో మూడు చోట్ల పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రజల్లోనూ చిరుధాన్యాల వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ ఉత్పత్తులను పూర్తిగా సేంద్రియ విధానంలోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నారు.
- టీజీఐఐసీ, ఎంఎస్ఎంఈలో భాగంగా ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. అక్షయ అగ్రిటెక్ అనే సంస్థకు వ్యవసాయ ఉపకరణాల తయారీ పరిశ్రమ కోసం ఇందులో స్థలం కేటాయించారు. మరో రెండు సంస్థలు ప్రభుత్వం వద్ద ఎంవోయూ దశలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనపై టీజీఐఐసీ జిల్లా మేనేజర్ బహుగుణను 'ఈనాడు' సంప్రదించింది. రూ.13 కోట్లతో జరుగుతున్న పనుల్లో వేగం పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం అంతర్గత రహదారుల పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు, తాగునీటి వసతులు కల్పిస్తున్నామన్నారు.

ధాన్యం ఆరబెట్టే యంత్రం

యువ రైతు ఆలోచనలకు రూపం



ధాన్యం ఆరబెట్టే యంత్రం



కిషన్ కుమార్

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం

ఏటా అకాల వర్షాలతో ధాన్యం తడవడం.. తేమ శాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయకపోవడం.. మొలకలు రావడంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది.. తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు తాను పడ్డ ఇబ్బందులు ఇతరులు పడొద్దని.. ఎలాగైనా ధాన్యం అరబెట్టే యంత్రాన్ని తయారు చేయాలని మూడు యంత్రాలు తయారు చేసి విఫలమయ్యాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా గతంలోని లోపాలను సరిదిద్దుకుంటూ దాదాపు తొమ్మిదేళ్లపాటు శ్రమించి ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని తయారుచేశాడు జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన యువ రైతు గోనె కిషన్‌కుమార్. ఈ యంత్రం ద్వారా అప్పటికప్పుడు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలుకలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ధాన్యం ఆరబెట్టేందుకు భారీ యంత్రాలు ఉండగా రైతులకు అందుబాటులో తక్కువ ధరలో యంత్రాన్ని తయారు చేసినట్లు కిషన్‌కుమార్ వివరించాడు.

యంత్రం పనితీరు ఇలా..

హీటర్లు, భారీ ఫ్యాన్లు, కన్వేయర్ బెల్టు, వీఎఫ్‌డీ, టెంపరేచర్ కంట్రోలర్, 3 త్రీఫేజ్ మోటార్లతో యంత్రాన్ని తయారు చేశాడు. ధాన్యాన్ని యంత్రంలో పోసిన తర్వాత 200 డిగ్రీల వేడిలో ఫ్యాన్ల సాయంతో తేమ శాతం 15 నుంచి 17 శాతానికి చేరుకుంటుంది. గంటకు 100 బస్తాల వరకు తడిచిన ధాన్యం, మక్కలు ఆరబెట్టుకోవచ్చని వివరించారు. యంత్రంలో ఆరబెట్టిన ధాన్యం నారుపోసేందుకు జెర్మినేషన్ సమస్య కూడా లేదని తానే స్వయంగా నారు పోసి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2019లో పరిశ్రమలపై శిక్షణ పొందిన కిషన్‌కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్‌కేవీవైౖ రఫ్తర్ ఏబీఐ పథకంలో రెండేళ్ల కిందట రూ.4.50 లక్షలు తిరుపతి యూనివర్సిటీ నుంచి అందజేశారు. యంత్రం తయారీకి రూ.16 లక్షలు ఖర్చయినట్లు, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తే మరిన్ని యంత్రాలు తయారు చేస్తానని వివరించారు.

పొగబట్టిన విధి

- విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు
- ఊపిరాడక ఏడేళ్ల బాలుడి మృత్యువాత




సాయికుమార్

మానకొండూర్, న్యూస్‌టుడే: యూకేజీ చదువుతున్న ఆ బాలుడు దసరా సెలవులు రావడంతో ఇంట్లో హాయిగా నిద్రిస్తున్నాడు.. తల్లి పని మీద కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది.. కాసేపటికే విద్యుదాఘాతంతో జరిగిన అగ్ని ప్రమాదం బలి తీసుకుంది.. దట్టమైన మంటలు చెలరేగాయి.. బయటకు రావాలని ప్రయత్నించినా ఆ బాలుడు ప్రయత్నించినా లాభం లేకపోయింది.. కమ్ముకున్న పొగ ఆ చిన్నారిని బలి తీసుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన కుటుంబసభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది. గ్రామస్థులను కలిచి వేసింది. పోలీసుల కథనం ప్రకారం.. అగ్గిడి అనిత, రాజు దంపతులకు కూతురు, కుమారుడు సాయికుమార్ (7) సంతానం కాగా కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పరదాలు కూడా అద్దెకు ఇస్తారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో సాయికుమార్ ఇంట్లో పడుకుని ఉండగా తల్లి అనిత కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది. ఇంటికి విద్యుత్తు సరఫరా అయ్యే తీగ వదులుగా ఉండటంతో గాలికి ఊగి నిప్పు రవ్వలు చెలరేగాయి. అవి ఇంటి ముందు ఉన్న పరదాలపై పడటంతో మంటలు అంటుకున్నాయి. అవి ఇంట్లోకి వ్యాపించగా ఇంట్లో ఉన్న పరదాలకు కూడా నిప్పు అంటుకుంది. నిద్ర మేల్కొన్న సాయికుమార్ బయటకు రావడానికి ప్రయత్నించినా మంటలు ఎగిసి పడుతుండటంతో వీలుకాలేదు. భయంతో మరో గదిలోకి వెళ్లాడు. అయినా పొగ దాటికి ఊపిరి ఆడలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చి బాలుడిని బయటకు తీసినా అప్పటికే విగత జీవుడయ్యాడు. ఇంటికి కొద్ది దూరంలోనే ఉన్న తల్లి కుమారుడిని కాపాడుకుందామని పరిగెత్తుకు వచ్చినా లోపలికి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అయ్యో బిడ్డా అంటూ గుండెలు పగిలేలా రోదించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పల్లెల్లో మహిళా ఓటర్లే అధికం



న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

ఈసారి జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో మహిళా ఓటర్లు సత్తా చాటే అవకాశముంది. గ్రామ పంచాయతీ ఓటర్ల సంఖ్యను ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితాలో వారే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే అధికంగా ఉండటమే అందుకు కారణం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికి అనుగుణంగా అతివల ఓటర్లు పెరగడం వారి పాత్ర అన్ని రంగాల్లో కనిపిస్తోంది.

18 లక్షలకు పైగా..

గ్రామ పంచాయతీ ఓటర్ల సంఖ్యను తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 18,74,752 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,09,035 మంది పురుషులు, 9,65,666 మంది మహిళలు, 51 మంది ఇతరులు ఉన్నట్లు తేల్చారు. గత శాసనసభ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరు చేసి సెప్టెంబరు 13న జాబితా ప్రకటించారు. గత నెల 14 నుంచి 21 వరకు పంచాయతీల్లో అభ్యంతరాలు స్వీకరించి 28న తుది జాబితా ప్రచురించారు.

ఉమ్మడి జిల్లాలో ఓటర్ల వివరాలు...

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు
జగిత్యాల	20	380	3500	2,83,010	3,10,522	8
కరీంనగర్	15	323	3022	2,57,333	2,69,894	10
పెద్దపల్లి	14	263	2436	2,01,006	2,06,697	13
సిరిసిల్ల	12	254	2230	1,67,686	1,78,553	20

అనంతరం ఎన్నికల సంఘం పరిశీలించి ఖరారు చేసింది. ఈ ఓటర్ల వివరాల ప్రకారం పంచాయతీ వార్డుల్లోని ఓటర్లతో ఎన్నికల ప్రక్రియ చేపడతారు.

56,631 మంది ఎక్కువ మగువలు..

ఎన్నికల సంఘం ప్రకటించిన పంచాయతీ ఓటర్ల వివరాలను పరిశీలిస్తే మొత్తం 18 లక్షలకు పైగా ఓటర్లలో నారీమణులదే పై చేయిగా ఉంది. పురుషులకంటే 56,631 మంది అధికంగా ఉన్నారు. వీరిలో కూడా జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 27,512, పెద్దపల్లిలో 5691 మంది స్వల్పంగా ఉండగా కరీంనగర్‌లో 12,561 మంది, సిరిసిల్లలో 10867 మంది ఎక్కువగా ఉన్నారు. 51 మంది ఇతరులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

పంచాయతీల్లో సందడి..



ఎన్నికల సంఘం తుది జాబితా ప్రకటించిన తరువాత ఆయా జిల్లాలో పంచాయతీ, వార్డుల వారీగా పరిశీలిస్తూ రిజర్వేషన్లు ఇతర అంశాలపై ఆశావాహులు అంచనా వేసుకుంటున్నారు. గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొనే అవకాశముంది.

నేటి తరానికి మార్గదర్శకుడు రత్నాకర్‌రావు

మాజీ మంత్రి జువ్వాడి విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు



కోరుట్లలో రత్నాకర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో విప్ లక్ష్మణ్‌కుమార్, జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వినోద్, ఆది శ్రీనివాస్

కోరుట్ల, న్యూస్‌టుడే: నేటితరం నాయకులు, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకుడు దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల ముందు ఏర్పాటు చేసిన రత్నాకర్‌రావు కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రత్నాకర్‌రావు గ్రామ సర్పంచిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్ర మంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. యువ నేతలను వెన్నంటి ప్రోత్సహించారని, అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నానంటే వారి అడుగు జాడల్లో నడవడంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో దేవాదాయశాఖమంత్రిగా దూప, దీప నైవేద్య పథకం ప్రవేశపెట్టి ఎన్నో దేవాలయాలకు పునరుజ్జీవం పోశారన్నారు. ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా పశువైద్య కళాశాలను కోరుట్లకు తీసుకువచ్చారని, ఇక్కడ చదివిన వందలాది మంది విద్యార్థులు వైశువైద్యులుగా రైతులకు సేవ చేయడంతోపాటు ఉపాధి పొందుతున్నారన్నారు. ధర్మపురి ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. కోరుట్ల ప్రాంతంలో తాగునీరు, సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రత్నాకర్‌రావుతో కలిసి 4 దశాబ్దాలుపాటు ప్రజలకు సేవ చేశామన్నారు. ఎప్పుడు గ్రామీణ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించేందుకు, రైతులకు సేవచేసేందుకు పరితపించేవారన్నారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, రత్నాకర్‌రావు కుమారులు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, శేఖర్‌రావు మంత్రి శీధర్‌బాబును సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జగిత్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు డా.సంజయ్, గడ్డం వినోద్, పెద్దపల్లి, భువనగిరి ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఆరెపల్లి మోహన్, కోరుట్ల, జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తుది పోరుకు కరీంనగర్ క్రికెట్ జట్టు



జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఉమ్మడి జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం కరీంనగర్, నల్గొండ జిల్లా జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 299 పరుగులు సాధించింది. వాకౌట్ పద్ధతిలో గెలుపొందింది. కరీంనగర్ జిల్లా జట్టులోని తక్షిల్ 138, అక్దాం 79, రిత్విక్ 20, క్రమాన్ 17 పరుగులు సాధించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తక్షిల్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్‌లు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.

కుస్తీ పోటీలు ప్రారంభం

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలో శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి పోటీలు ప్రారంభించగా, క్రీడాకారులు వందన సమర్పణ చేశారు. వర్షం పడటంతో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.



కరీంనగర్ కుస్తీ క్రీడాకారుల వందన సమర్పణ

హ్యాండ్‌బాల్‌లో సెమీ ఫైనల్‌కు కరీంనగర్

కోస్గి న్యూటౌన్ : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరగా, రెండో సెమీఫైనల్ మ్యాచ్ కరీంనగర్ - హైదరాబాద్ మధ్య శనివారం ఉదయం నిర్వహించనున్నారు.

బడి పిల్లలకు మళ్లీ రాగిజావ

పండుగ సెలవుల తర్వాత ప్రారంభం



పెద్దపల్లిలో రాగి జావ గ్లాసులు చూపుతున్న విద్యార్థినులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మూడు నెలలుగా నిలిచిపోయిన రాగిజావ పంపిణీ పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దసరా సెలవుల తర్వాత ఉదయం వేళలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయనున్నారు. పీఎం పోషణ్ పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10వ తరగతి పిల్లలకు రాగిజావ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం చాలా మంది పిల్లలు ఏమీ తినకుండానే బడికి వచ్చి మధ్యాహ్నం వరకు పస్తులుండాల్సి వస్తోంది.

వారంలో మూడు రోజులు

ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి పౌడర్, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందిస్తున్నారు. నిర్వహణ బాధ్యతను మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు అప్పగించారు. రాగిజావ తయారీ కోసం ఉదయాన్నే పాఠశాలకు వెళ్తున్నా శ్రమకు తగిన ప్రతిఫలం ఉండటం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పలు చోట్ల నామమాత్రంగా పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. గతంలో ఎదురైన అడ్డంకులు అధిగమిస్తేనే పోషక మిళితమైన జావ పిల్లలకు అందనుంది. పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,28,571 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

గతేడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పోషకాహార లోపం నివారించేందుకు, ఉదయం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మూడేళ్ల కిందట ఎంపిక చేసిన జిల్లాల్లో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు పూర్తి సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం అమలు చేశారు. సత్ఫలితాలు రావడంతో గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో 6 రోజులు, జులైలో 11 రోజులకే సామగ్రి రావడంతో అక్కడి వరకే పంపిణీ చేశారు. ప్రభుత్వంతో సంస్థ ఒప్పందం కుదుర్చుకోవడంలో జాప్యం జరగడంతో మూడు నెలలుగా పథకం నిలిచిపోయింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ఓ పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.వెంకటస్వామిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తొమ్మిదో తరగతి చదివే బాలికను వేధించాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. అశ్లీల చిత్రాలను చూపిస్తూ వేధించాడని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎస్సై శ్వేత సస్పెన్షన్



జగిత్యాల, న్యూస్‌టుడే: కోరుట్ల ఎస్సైగా పనిచేసిన శ్వేత సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల జగిత్యాలకు చెందిన బొల్లారపు శివప్రసాద్‌ను ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించగా అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆమెను జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పూర్తిస్థాయి నివేదిక సమర్పించిన నేపథ్యంలో మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సై శ్వేతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,761 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తేమతో తగ్గిన కొత్త పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం అధిక తేమతో కొత్త పత్తి ధర తగ్గింది. యార్డుకు 38 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో కొత్త విడి పత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000.. గరిష్ఠ ధర రూ.6,750 పలికింది. గురువారం గరిష్ఠ ధర రూ.6900లు నమోదు కాగా రోజు వ్యవధిలోనే రూ.150 తగ్గింది. 58 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,500 నుంచి రూ.6,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. ఏడు ట్రాలీల పాత విడిపత్తి విక్రయానికి రాగా రూ.7,200 నుంచి రూ.7,400 వరకు వెచ్చించి వ్యాపారులు ధరను నిర్ణయించారు. రైతులు కొత్తపత్తిని ఏరగానే నేరుగా యార్డుకు విక్రయానికి తీసుకు వస్తున్నారని తేమతో ధర తగ్గుతోందని మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. రానున్న సీజన్ కోసం స్థానిక జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల పరిశీలన, మరమ్మతు పనులు చేపట్టడంతో దీపావళి తర్వాతే మిల్లుల వ్యాపారులు కొనుగోళ్లు చేపట్టనున్నారు. ప్రస్తుతం కొత్త పత్తిని చిన్న వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

రాజన్న గోశాలలో మూడు కోడెల మృతి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం మూడు కోడెలు అస్వస్థతకు గురై మృతి చెందాయి. మృతి చెందిన వాటిని మూలవాగులో గోశాల సిబ్బంది పూడ్చి వేశారు. జెర్సీ బ్రీడ్‌కు సంబంధించినవి కావడంతో ప్రస్తుతం ఎండల వేడికి తట్టుకోలేక రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాయని, వైద్యం అందించినప్పటికీ కోలులేక మృతి చెందినట్లు గోశాల పశువైద్య సహాయకుడు సాయి తెలిపారు.

16 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ ఆరో, అయిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16, 17 తేదీల నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ అయిదో సెమిస్టర్ పరీక్షలు 17 నుంచి జరగనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, వీర్నపల్లి

? వీర్నపల్లి మండలం గర్జనపల్లి కొత్త చెరువుపై మొక్కలను వదిలి వెళ్లారు. చాలా రోజులు గడుస్తున్నా నాటడం లేదు. నీరందించకపోవడంతో ఎండలకు ఎండిపోతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నాటేలా చూడాలి. - **మహేశ్, స్థానికుడు**

✔ మూడు రోజుల క్రితం కొత్త చెరువు వద్ద మొక్కలను తీసుకెళ్లారు. చనిపోయిన వాటి స్థానంలో నాటాల్సి ఉంది. గుర్తించి నాటిస్తాం. - **శ్రీహరి, ఏపీవో, వీర్నపల్లి**

న్యూస్‌టుడే, గంభీరావుపేట

? గంభీరావుపేటలోని 11, 12, 13 వార్డుల్లో మురుగు కాలువల పక్కన ఖాళీ ప్రదేశాల్లో గడ్డి పెరిగి అధ్వానంగా ఉంది. దీనివల్ల దోమల బెడద తీవ్రంగా ఉంది. - **రాజేశ్, గంభీరావుపేట**

✔ రెండు రోజుల్లో పూర్తిగా తొలగింపజేస్తాం. - **రాజశేఖర్, ఎంపీవో**

ఆధునిక హంగులతో పీహెచ్‌సీ నిర్మాణం

మెరుగుపడనున్న వైద్య సేవలు

న్యూస్‌టుడే, రుద్రంగి

ఆధునిక వసతులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపుదిద్దుకుంటుంది. ఇందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మెరుగుపడనున్నాయి.

చందుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి 2022లో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా రూ. 1.56 కోట్లు మంజూరయ్యాయి. పాత పీహెచ్‌సీ ఆవరణలోని ఖాళీ స్థలంలో నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. అయితే ప్రారంభంలో అనేక అవాంతరాలు ఏర్పడ్డాయి. చివరికి ఏడాది క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకొంటుంది. త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.


వినియోగంలోకి రానున్న చందుర్తి పీహెచ్‌సీ నూతన భవనం

జూన్ నుంచి సెప్టెంబర్ 13 వరకు అందించిన సేవలు

మలేరియా పరీక్షలు	153
ఇతర పరీక్షలు	1,491
ఓపీ	7,862
ఐపీ	289
సాధారణ కాన్పులు	3

తీరనున్న గదుల కొరత

నూతన భవనం అందుబాటులోకి వస్తే గదుల కొరత తీరనుంది. పాత భవనంలో కేవలం ఆరు పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో రోగులు ఒకేసారి ఆరోగ్య కేంద్రానికి వస్తే సేవలు అందించేందుకు ఇబ్బందులు ఉండేవి. నూతన భవనంలో గదులు, పడకల సంఖ్య పెరగనుంది.

తొలగనున్న భయాలు

● ప్రస్తుతం పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సేవలు పొందేందుకు వచ్చే రోగులతోపాటు వైద్య సేవలు అందించే వైద్యులు, సిబ్బంది భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

● వర్షాకాలం వచ్చిందంటే భవనంలోని గదుల పైపెచ్చులు ఊడిపోతున్నాయి. అక్కడక్కడా వర్షపు నీరు ఉరుస్తుంది. దీంతో విలువైన పరికరాలు, రికార్డులను సురక్షితంగా ఉంచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గోడలు పాకురు పడుతున్నాయి.

● అప్పుడప్పుడు గదుల్లో విద్యుదాఘాతం ఏర్పడి షాక్ కొట్టిన సందర్భాలున్నాయి.

తొందరగా అందుబాటులోకి తీసుకురావాలి



పాత భవనంలో సరైన సదుపాయాలు లేవు. కొత్తగా నిర్మిస్తున్న భవనంలో అన్ని సౌకర్యాలు కల్పించి తొందరగా అందుబాటులోకి తీసుకురావాలి. ప్రస్తుతం ఉన్న వైద్య సేవలతో పాటు మరి కొన్ని సేవలను తీసుకువస్తే నిరుపేదలకు సౌకర్యంగా ఉంటుంది. - **పులిసె లత, చందుర్తి**

త్వరలో నూతన భవనంలోకి...



నూతన భవనం త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకొంటున్నాం. ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాం. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో పూర్తి విశ్వాసం కల్పిస్తున్నాం. - **సంపత్, మండల వైద్యాధికారి, చందుర్తి**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

బోయినపల్లి, న్యూస్‌టుడే: విలాసాగర్, బోయినపల్లి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని బోయినపల్లి, రామన్నపేట, తడగొండ రోడ్డు, మర్లపేట, దేశాయపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్తు సరఫరా ఉండదని సెస్ ఏఈ ప్రశాంత్ తెలిపారు. మల్లారం విద్యుత్తు ఉపకేంద్రం నుంచి వచ్చే 33 కేవీ ఫీడర్ లైన్ నందికమాన్ వద్ద అత్యవసర పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాలి

కోనరావుపేట, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో సీపీఎం గ్రామ మహాసభలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటీశ్వరుల కొమ్ము కాస్తున్న భాజపా విధానాలపై పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రైతుల సమస్యలపై సీపీఎం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సీపీఎం కార్మికులు, కర్షకులు, పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం సీతారాం ఏచూరితో పాటు మరికొంతమంది అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముష్కం రమేశ్, నాయకులు జవ్వాజి విమల, బడుగు రాములు, పూజం జయ, శారద, లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు పనిభారం తగ్గించి పెండింగ్ వేతనాలు అందించాలని సీఐటీయూ నాయకులు శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్టాఫ్ నర్సులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి అన్సల్‌దాస్ గణేశ్, పద్మ, నాగమణి, దేవలక్ష్మి, తిరుపతి, శేఖర్, మహేందర్, శ్రీనివాస్, శశికళ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గ సభ్యులు పని చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు ముత్యాల సత్యంరెడ్డి, కొంగరి కిష్టారెడ్డి, జంగ శ్రీకాంత్‌రెడ్డి, మద్ది నారాయణరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, గుట్టపల్లి లక్ష్మారెడ్డిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం మండల నాయకులు తిరుపతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జంగ బాల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మోతె లక్ష్మారెడ్డి, వంరుపటి రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, పొన్నాల బాల్‌రెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల మానవత్వం.. కుమారుడి ఆచూకీకి హామీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: శారీరకంగా కదలలేని స్థితిలో ఉన్న వారిని ఆదుకుంటామంటూ తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు ఎల్లారెడ్డిపేట పోలీసులు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన తాళ్ల సత్తవ్వ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఒక్కగానొక్క కుమారుడు వెంకటరెడ్డి కొన్ని సంవత్సరాల క్రితం గ్రామాన్ని వదిలివెళ్లాడు. కూకట్‌పల్లిలోని ఓ చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. కరోనా సమయంలో తల్లి సత్తవ్వను అక్కడికి తీసుకెళ్లాడు. తిరిగి ఎల్లారెడ్డిపేటకు పంపిస్తూ తన ఫోన్ నంబరును రాసిచ్చాడు. ఎంతకీ ఫోన్ పని చేయకపోవడంతో కుమారుడిపై వృద్ధురాలు బెంగపెట్టుకుంది. తన ప్రాణం పోయేలోగా కుమారుడిని ఒక్కసారైనా చూడాలని పరితపిస్తోంది. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాలరాజుయాదవ్ ఈ విషయాన్ని ఎస్సై రమాకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్సై కానిస్టేబుల్ శ్రీనివాసరావును సత్తవ్వ ఇంటికి పంపించారు. ఆమె నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి వెంకట్‌రెడ్డి ఆచూకీ కనుగొంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలరాజుయాదవ్ ఉన్నారు.

నేడు గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు ప్రతి నెలా చెల్లించకుండా కార్మికులను పస్తులుంచుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. శనివారం జరిగే ధర్నాను కార్మికులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అగ్నిమాపక అధికారుల తనిఖీ

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలో అగ్నిమాపక ఎస్సై నరేందర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని దుకాణ సముదాయాలు, షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించారు. అగ్ని ప్రమాద రక్షణ పరికరాల పనితీరును పరిశీలించారు. కాలం చెల్లిన వాటిని తొలగించి నాణ్యత ప్రమాణాలతో కూడిన కొత్త వాటిని ఉపయోగించుకోవాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అమ్మ ఆసుపత్రి సిబ్బందిని హెచ్చరిస్తున్న ఎస్సై నరేందర్

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం నేరెల్ల గ్రామానికి చెందిన కోల లక్ష్మి, సురేశ్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వినయ్ కుమార్, చిన్న కుమారుడు సాయి తేజ ఉన్నారు. తండ్రి జిల్లెల్ల క్రాసింగ్ వద్ద ఎరువుల దుకాణం నిర్వహించగా, తల్లి బీడీలు చుడుతోంది. వినయ్ కుమార్ చిన్నప్పటి నుంచి తన మేనమామ పసుల స్వామిని ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాడు. తన మేనమామ 2013లో గ్రూప్-2 రాసి ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా సహాయ పౌర సరఫరాలశాఖ అధికారిగా పని చేస్తున్నారు. ఆయన సలహాలు, సూచనలు పాటిస్తూ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో సాంఘికశాస్త్రం (స్కూల్ అసిస్టెంట్) లో జిల్లాలో 10వ ర్యాంక్, ఎస్జీటీలో 38వ ర్యాంక్ సాధించాడు. వసతి గృహ సంక్షేమ అధికారిగా జోనల్ స్థాయిలో 58వ ర్యాంక్ సాధించి ఆదర్శంగా నిలిచాడు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్‌గా చేరేందుకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశాడు. భవిష్యత్తులో గ్రూప్-1 సాధించాలని తన లక్ష్యంగా పేర్కొన్నాడు.


వినయ్‌కుమార్

'మాదిగలను మోసం చేసిన సీఎం'

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని మహాజన్ సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సీఎం వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రానికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోవడం విచారకరమన్నారు. డీఎస్సీ ఫలితాలలో ఎస్సీ వర్గీకరణను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, నాయకులు గూండా థామస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


రాజన్న ఆలయ ప్రాంగణంలో కోలాటం ఆడుతున్న మహిళలు


ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మతో విద్యార్థినులు, అధ్యాపకులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. ప్రధాన కూడళ్లలో ఉంచి ఆడి పాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. - **న్యూస్‌టుడే యంత్రాంగం**


కొండాపూర్‌లో...

ప్రయాణికులకు బహుమతుల పంపిణీ

వేములవాడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ వేములవాడ బస్టాండ్‌లో శుక్రవారం అధికారులు లక్కీడ్రా విజేతలను ఎంపిక చేసి బహుమతులు పంపిణీ చేశారు. వేములవాడ నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు గిఫ్టు స్కీం పెట్టారు. ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డిలు లక్కీడ్రా తీసి ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. భవాని ప్రథమ, లావణ్య ద్వితీయ, పూజిత తృతీయ బహుమతికి ఎంపిక కాగా వారికి ఆర్ఎం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.


విజేతలను ఎంపిక చేస్తున్న ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి

ఈజీఎస్ బోర్డు పనులకు బహుళ ప్రయోజన కార్మికులు

బోయినపల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ బహుళ ప్రయోజన కార్మికులతో ఈజీఎస్ పనులు చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో బోర్డు (సిమెంట్ గద్దె) ఏర్పాటు చేయాలి. ఒక్కో బోర్డు ఏర్పాటుకు రూ.4 వేలు ఈజీఎస్ నిధుల నుంచి చెల్లిస్తారు. కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సుమారు రెండేళ్ల క్రితం చేపట్టిన పనులకు సంబంధించి వీటిని ఏర్పాటు చేయలేదు. గుత్తేదారుతో గానీ, ఇతరులతో గానీ చేయించాల్సి ఉంది. పంచాయతీ ట్రాక్టరులో ఇసుక, సిమెంట్, ఇటుకలు తరలించి బహుళ ప్రయోజన కార్మికులతో అధికారులు పనులు చేయిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కొదురుపాకలో ఈజీఎస్ గద్దె నిర్మాణ పనుల్లో కార్మికులు

యువకులకు క్రీడా దుస్తులు

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ క్రీడాకారులకు శుక్రవారం నాయకులు క్రీడా దుస్తులు అందజేశారు. కొలనూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు సంకినేని రామ్మోహన్‌రావు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ వేర్వేరుగా క్రీడాకారులకు సొంత డబ్బులతో దుస్తులు అందించారు. యువకులు సెలవులు దినాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరారు. ఆటలతో క్రీడాకారులకు శారీరక, మానసిక పెరుగుదల బాగుంటుందన్నారు.

ముగిసిన డిజిటల్ సర్వే

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ గ్రామీణ మండలం బొల్లారంలో చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వే శుక్రవారం ముగిసింది. మొత్తం 182 కుటుంబాలను పూర్తి స్థాయిలో సర్వే చేసి వివరాలను నమోదు చేసుకున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం డిజిటల్ హెల్త్ కార్డు పైలట్ సర్వేకు ఎంపికైనట్లు తహసీల్దార్ భూపతి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు అధికారులు గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామంలో 92 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సర్వేలో హెల్త్ కార్డుతో పాటు రేషన్ కార్డులో పేరు లేని వారిని నమోదు చేయటం జరుగుతుందన్నారు. మరణించిన వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదును విస్తృతం చేయండి


మాట్లాడుతున్న వికాస్‌రావు

చందుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని భాజపా వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు స్పందన బాగుందని, బూత్ స్థాయి కార్యకర్తలు మరింతగా శ్రమించి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మారుతిరెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి జ్వర పీడితుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రంగంపేట జంపన్న చెరువు కరకట్టను పరిశీలించారు. బతుకమ్మ పండగకు మహిళలకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏఎన్ఎం మంజుల, పంచాయతీ కార్యదర్శులు పురుషోత్తం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ఉత్పత్తుల అమ్మకాల పేరుతో మోసం
ఇద్దరు వ్యక్తులు, ఏజెంట్లపై కేసు నమోదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పోషకాహార, హెర్బల్ లైఫ్ ఉత్పత్తులు అమ్మితే లాభాలు వస్తాయంటూ మోసం చేసిన ఇద్దరు వ్యక్తుల పైన, ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన బొజ్జ లక్ష్మణ్, లావణ్య ఇల్లంతకుంటలో ఫ్రెష్ న్యూట్రిషన్ సెంటర్ నడుపుతున్నారు. మండలంలోని ముస్తాబాద్‌పేటకు చెందిన సావనపల్లి తైలజ, జెట్టి విజయలక్ష్మి, అనంతగిరి గ్రామానికి చెందిన వల్లంపట్ల సుమలతను రోజూ అక్కడికి డైట్ న్యూట్రిషన్ షేక్ తాగుతున్న క్రమంలో బొజ్జ లక్ష్మణ్, లావణ్యలు వారితో పోషకాహార, హెర్బల్ లైఫ్ ఉత్పత్తులు కొనుగోలు చేసి విక్రయిస్తే నెలకు రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఏదైనా వస్తువు అమ్ముడు పోకపోతే తిరిగి మీ డబ్బులు మీకు వస్తాయని వారిని నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు చొప్పున మొత్తం రూ.9 లక్షల విలువ చేసే వాటిని కొనుగోలు చేయించారు. దాదాపు 8 నెలలు గడిచినా వారి వద్ద ఎవరూ కొనుగోలు చేయలేదు. దీంతో ముగ్గురు సరకు తిరిగి ఇచ్చి డబ్బులు ఇప్పించాలని లావణ్య, లక్ష్మణ్‌లను కోరారు. ఇంకా సంవత్సరం కాలేదని, సమయం ఉందని నమ్మబలికారు. ఏడాది పూర్తయిన తరవాత మళ్లీ అడిగితే తిరిగి తీసుకోవడం జరగదని చెప్పడంతో మోసపోయామని గుర్తించారు. దీంతో బాధితురాలు సావనపల్లి తైలజ ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా లావణ్య, లక్ష్మణ్‌తోపాటు ఏజెంట్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: మాజీ మావోయిస్టునని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి డబ్బు తీసుకున్న వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ మావోయిస్టునని, రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశాడు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించాడు. ఈ నెల 2న హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమీషన్ బేస్డ్ వ్యక్తికి రూ.8 వేలు ఇవ్వాలని శేఖర్‌రెడ్డికి చెప్పాడు. బాధితుడు రూ.8 వేలు ఇచ్చాడు. అనంతరం ఖిల్లాగణపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమీషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. నిందితుడు పెద్దపల్లిలోని సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్లపేటలో నగదు, బంగారం చోరీ

కోరుట్లపేట (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గంద్ర ధర్మారావు ఇంటిలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తులమున్నర బంగారం ఆభరణాలు, రూ. 15 వేల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ధర్మారావు గత నెల 30న ఇంటికి తాళం వేసి, కుటుంబీకులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉండటంతో చోరీ చోటుచేసుకున్నట్లు గ్రహించాడు. ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు బీరువా ధ్వంసం చేసి, అందులోని బంగారం, నగదును దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు రెండు పడక గదుల ఇంట్లో సిరిమల్లె శ్రీధర్ (34) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల రాములు-రేణుక దంపతులకు ఇద్దరు కూతుర్లు, ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీధర్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. ఇటీవల ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బెడ్‌రూంలోకి వెళ్లిన శ్రీధర్ సాయంత్రం అయినా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

రూ.5 వేల జరిమానా

బోయినపల్లి, న్యూస్‌టుడే: తడగొండలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న జేసీబీని పట్టుకొని రూ.5 వేల జరిమానా విధించినట్లు తహసీల్దారు పుష్పలత శుక్రవారం తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నలుగురు యువకుల బైండోవర్

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో దూషించుకుంటున్న నలుగురు యువకులను బైండోవర్ చేసినట్లు వేములవాడ గ్రామీణ ఎస్సై మారుతి తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు, చెక్కపల్లి గ్రామానికి చెందిన యువకుడు సామాజిక మాధ్యమాల్లో ఒకరినొకరు దూషించుకుంటూ గొడవలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు నలుగురు యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.


వీర్నపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


సిరిసిల్ల నెహ్రూనగర్‌లో ...


వేములవాడ: పంచముఖ హనుమాన్ ఆలయం వద్ద...

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

శరన్నవరాత్రులు పురస్కరించుకుని శుక్రవారం గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత విగ్రహానికి పంచామృతాలతో అభిషేకించిన తర్వాత ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించారు. గాయత్రీ మంత్ర పారాయణంతో మండప ఆవరణలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. భక్తులు మంగళహారతులు ఇచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. - **న్యూస్‌టుడే యంత్రాంగం**


సుద్దాలలో...


వెంకంపేటలో...


రుద్రంగిలో...


తంగళ్లపల్లిలో...